రాష్ట్రీయ గౌరవ్ అవార్డులు ప్రదానం


అవార్డు గ్రహీతలతో మల్లు రవి

నాంపల్లి: సమాజంలోని వివిధ రంగాల్లో విశేషంగా కృషి చేసిన పలువురు లబ్ద ప్రతిష్టులను గుర్తించి సత్కరించేందుకు రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్–2023 వేడుకలను రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న 120 మంది వ్యక్తులకు ఈ అవార్డులను అందజేశారు. సమాజానికి చేసిన ఆదర్శప్రాయమైన సేవలను గుర్తించి అవార్డు గ్రహీతలను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి హాజరై గ్రహీతలను అవార్డులతో సత్కరించారు. రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ నిర్వాహకులు సాత్విక గుప్తా, అఖిల్ సివ్వా మాట్లాడుతూ..వ్యక్తులను ఆయా విభాగాల్లో రాణించేలా ప్రోత్సహించడమే మా ఉద్దేశ్యమని చెప్పారు. విశేషమైన వాటిని వెలుగులోనికి తీసుకురావాలని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. సమాజాన్ని సానుకూలంగా ప్రభావితం చేసిన వ్యక్తుల విజయాలు రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్–2024 మార్చిలో నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ నిర్మాత రామ సత్యనారాయణ, సుధాకర్ పైపుల మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ మీలా, డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ డి.మధుకర్ నాయక్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరుగనరి జ్యోత్స్న, అవార్డు గ్రహీతలు శోభాశెట్టి(బిగ్‌బాస్ ఫేమ్), డాక్టర్ ఆశ్లేష (కౌన్సిలర్), మోనిష్ యర్రగుంట్ల (ఇన్వెస్టర్), చరణ్ లక్కరాజు(స్టూడెంట్ ట్రైబ్), ప్రఖ్యాత యాంకర్ దేవి నాగవల్లి పాల్గొన్నారు.

అధ్వానంగా రైతు బజార్

- నిర్వహణ మరిచిన అధికారులు
- పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రైతు బజార్ గేటు ముందే అక్రమ స్టాల్స్


కుళ్లిన కూరగాయల వ్యర్థాలు


బోర్డులేని రైతు బజార్ మెయిన్ గేటు


ధ్వంసమైన రైతు బజార్ వాష్‌బెషిన్

గోల్కొండ: నగరంలో మొదటిసారిగా ప్రారంభమైన రైతు బజార్‌లో మెహిదీపట్నం ఒకటి. సుమారు రెండు దశాబ్దాల చరిత్ర గల ఈ రైతు బజార్ నిర్వహణపై అధికారులు శ్రద్ధ కనబరచడం లేదు. మెహిదీపట్నం పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉన్న రైతు బజార్ ఇది ఒక్కటే కావడం గమనార్హం. ఒకప్పుడు టోలిచౌకీ, షేక్‌పేట్, లంగర్‌హౌస్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల వారు కూరగాయల కోసం ఈ రైతు బజార్‌కే వచ్చే వారు. అయితే క్రమేనా రైతు బజార్‌కు వచ్చే కొనుగోలుదారుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీని నిర్వహణ సరిగ్గా లేదని పలువురు కొనుగోలు దారులు అంటున్నారు.

నకిలీ రైతులే ఎక్కువ..

అసలైన రైతులకు తమ పంటలు అమ్ముకునేందుకు రైతు బజార్‌లు ఏర్పాటు చేశారు. అయితే నేడు గుర్తింపు పొందిన రైతుల స్థానంలో నకిలీ రైతులే కానవస్తున్నారు. రైతు బజార్‌లో కూరగాయలతో పాటు పప్పులు, నూనెలు, బియ్యం స్టాల్స్ కూడా ఉన్నాయి. అయితే ఈ రైతు బజార్‌లో బియ్యం స్టాల్స్ ఎక్కువగా కనబడుతున్నాయి. దీనిని రైతు బజార్‌గా కాక రైస్ బజార్‌గా పలువురు అంటున్నారు. రైతు బజార్ అధికారులు చేతివాటంతో నకిలీ రైతులను తయారు చేసి వారికి గుర్తింపు కార్డులు కూడా అందిస్తున్నారని పలువురు అంటున్నారు. కాగా రైతు బజార్ లోపల కంటే రైతు బజార్ బయటనే ఎక్కువ కూరగాయలు అమ్ముడవుతున్నాయి.

అపరిశుభ్రంగా టాయిలెట్స్..

రైతు బజార్ నిర్వహణ అధ్వానంగా మారడంతో గత కొన్ని సంవత్సరాలుగా మెహిదీపట్నం చుట్టూ పరిసర ప్రాంతాల వారు రైతు బజార్‌కు రావడం తగ్గించారు. రైతు బజార్‌లో పారిశుద్ధ్య పనులు కూడా సవ్యంగా జరగడం లేదు. కుళ్లిన కూరగాయలను వ్యాపారులు రైతు బజార్ ప్రహరీ చుట్టూ డంపింగ్ చేస్తున్నారు. అవి కుళ్లి వాటిపై ఈగలు, ఇతర విష కీటకాలు వాలి ఆ ప్రదేశం అధ్వానంగా మారింది. టాయిలెట్స్ వద్ద కూడా అపరిశుభ్రంగా ఉంది. రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన వాష్‌బేసిన్‌లు ఏనాడో ధ్వంసమయ్యాయి.

పెరిగిన వారాంతపు సంతలు..

- రైతు బజార్ నిర్వహణ అధ్వానంగా మారడంతో బస్తీలు, కాలనీల వాసులు రైతు బజార్‌కు ప్రత్యామ్నాయంగా వారాంతపు సంతలకు వెళ్తున్నారు.
- తాజా కూరగాయలతో పాటు తమ ఇళ్లకు సమీపంలోనే రైతు బజార్‌లో కంటే తక్కువ ధరకే కూరగాయలు లభిస్తుండడతో వారాంతపు సంతలకే వెళ్తున్నారు.
- పలువురు కూరగాయల వ్యాపారులు బస్తీలు, కాలనీవాసులను సంప్రదించి ఆయా ప్రాంతాల్లో వారాంతపు సంతలు ఏర్పాటు చేస్తున్నారు.
- నేడు మాసబ్‌ట్యాంక్, అహ్మద్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వారాంతపు సంతలు కొనసాగుతున్నాయి.
- ఇవన్నీ మెహిదీపట్నం రైతు బజార్‌కు అతిసమీపంలోనే ఉన్నాయి. టోలిచౌకీ, తూమ్స్ చౌరస్తా, షేక్‌పేట్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో సైతం కూరగాయల కోసం ప్రజలు రైతు బజార్‌కు కాకుండా వారాంతపు సంతలకే వెళ్తున్నారు.
- మెహిదీపట్నం రైతు బజార్ నిర్వహణను అధికారులు పటిష్టంగా చేయడంతో పాటు రైతు బజార్‌లో పారిశుద్ధ్య పనులు కూడా ఎప్పటికప్పుడు చేపట్టాలి. అటువంటి అప్పుడే రైతు బజార్‌కు మళ్లీ పూర్వ వైభవం తేవచ్చు.

'గరం' చాయ్.. పీలో భాయ్!


రోజు రోజుకు తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో చలిపెరిగి గజగజ వణికిస్తోంది. చలిని తట్టుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లు కప్పుకుంటున్నారు. చలిని తట్టుకునేందుకు చాలాసార్లు టీ తాగుతుంటారు. ఆదివారం చార్మినార్ ముందున్న ఓ హోటల్ వద్ద ఓ వృద్ధుడు గరం గరం చాయ్ తాగుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – చార్మినార్

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



ఎమ్మెల్యే వాకాటి శ్రీహరిని సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

చార్మినార్: మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరిని పాతబస్తీకి చెందిన తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన మేధో మధన సదస్సులో తాము పాల్గొని ఆయనను సన్మానించినట్లు వారు తెలిపారు. ముదిరాజ్ సామాజికవర్గం ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించినప్పుడు ఆశించిన ఫలితాలు సాధిస్తామని వాకాటి శ్రీహరి చెప్పినట్లు వారు తెలిపారు.

జీఎన్‌ఐటీఎస్‌లో 'ఎన్ఈపీ-2020'



గోల్కొండ: జాతీయ విద్యా విధానం–2020పై ఆదివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమెన్ ఎక్సలెన్స్ సంచాలకులు స్వామి బోధమయానంద మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన జాతీయ విద్యా విధానంపై మాట్లాడారు. దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఎన్ఈపీపై మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్ఈపీలో అనుభవపూర్వక అభ్యాసం కీలకమైన భాగం అని అన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ సి.ఎస్.ఆర్.ప్రభు, డాక్టర్ పి.మృణాళిని, డాక్టర్ లోకానందరెడ్డి, డాక్టర్ ఏ.వి.నరసింహరావు, కే.రూపా, డాక్టర్ జే.ఎస్.ఆర్.ప్రసాద్, జీఎన్ఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, కార్యక్రమం కన్వీనర్ వి.జహ్నవి, కోకన్వీనర్లు డాక్టర్ వి.విజయలక్ష్మి, డాక్టర్ ఏ.వి.నర్సింహరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఐసీబీఎం స్నాతకోత్సవం


పట్టాలు పొందిన విద్యార్థులతో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

గోల్కొండ: ఉద్యోగాధారిత విద్య పట్ల నేటి యువత ఆసక్తి చూపడం వారిలో వస్తున్న మార్పుకు సంకేతం అని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. ఆదివారం అత్తాపూర్‌లోని ఐసీబీఎం–స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ 16వ స్నాతకోత్సవాన్ని ఘనంగా జరిగాయి. ఆయన చేతుల మీదుగా పట్టాలు అందుకున్న 2021–23 విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఐసీబీఎం–ఎస్‌బీఈ మొట్టమొదటి బి–స్కూల్ అని ఇది తెలంగాణకే గౌరకారణమన్నారు. ఎంతో ముందు చూపుతో కరికులంను తయారు చేస్తూ యువతకు ప్లేస్‌మెంట్ ఇప్పిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఐసీబీఎం–ఎస్‌బీఈ చైర్మన్ ప్రొఫెసర్ జరార్ అహ్మద్ మాట్లాడుతూ.. 2021–23 చెందిన 150 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి పట్టాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బీ హైదరాబాద్ పీఆర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కిరణ్‌నేతి, హ్యాకెట్ కంపెనీలు పీఆర్ సురేష్ కోకా, సుమన సుంకర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దత్తాత్రేయ జయంత్యుత్సవాలు


దత్తాత్రేయస్వామి

జియాగూడ: సీతారాంబాగ్ దత్తాత్రేయ గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో ఈనెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు శ్రీ దత్తాత్రేయ వేడుకలను దత్తాత్రేయ స్వామి నవగ్రహ టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ గోకుల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌సింగ్, కోశాధికారి పి.అరవింద్‌సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. 25న తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాత సేవా, అభిషేకం, 7 గంటల నుంచి దేవతార్చన శిఖర పూజా కార్యక్రమం, 26న దత్తజయంతి సందర్భంగా సుప్రభాత సేవా, అభిషేకం, దేవతార్చన, దత్తాత్రేయస్వామివారి డోలారోహణ, సాయంత్రి పల్లకీ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

చీరలు పంపిణీ


చీరలు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు మిత్ర కృష్ణ, అరుణ్‌కుమార్ తదితరులు

గోల్కొండ: అధికారంలో ఉన్నా లేకపోయిన బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి మిత్ర కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్‌లో క్రిస్మస్ సందర్భంగా మహిళలకు చీరలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు వారివారి పండుగల సందర్భంగా కానుకలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, సాయి, మంజుల, జ్యోతి, రషీద్, పద్మ, తదితరులున్నారు.

కుక్క కాటుకు బాలుడి బలి


శరత్ (ఫైల్)

గోల్కొండ: కుక్క కాటుకు ఓ చిన్నారి బలైన ఘటన షేక్‌పేట్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వినోభానగర్ గుడిసెల్లో ఉంటూ కూలీ పని చేసుకుంటున్న అంజి–అనూషా దంపతులకు శరత్ (5 నెలలు) బాలుడు ఉన్నాడు. ఈ నెల 8న చిన్నారిని గుడిసెలో ఉంచి తల్లిదండ్రులు ఇద్దరూ పనికి వెళ్లగా కాసేపటి తర్వాత గుడిసెలోకి చొరబడిన కుక్క చిన్నారి శరత్ మెడ, తల, మొఖంపై కరిచింది. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడి తలకు ప్లాస్టిక్ సర్జరీ చేయగా చికిత్స పొందుతూ శరత్ ఆదివారం మధ్యాహ్నం మృత్యువాత పడ్డాడు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు


సైనిక దుస్తుల్లో ప్రదర్శనలు ఇస్తున్న రాక్ రిడ్జ్ విద్యార్థులు

గోల్కొండ: విద్యార్థుల సాహసోపేతమైన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం తారామతి బారాదరిలో మణికొండలోని రాక్ రిడ్జ్ స్కూల్ 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్ననాటి నుంచే దేశభక్తి గురించి వివరించాలని అన్నారు. అంతేకాకుండా విద్యార్థులు మక్కువ చూపే కోర్సులను మాత్రమే వారు ఎన్నుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో బండ్లగూడ, కిస్మత్‌పూర్ కార్పొరేటర్లు ప్రేమ్‌గౌడ్, సురేష్‌గౌడ్, పాఠశాల వ్యవస్థాపకులు తాళ్ల లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ స్వాతి యాదగిరిగౌడ్, తాళ్ల గౌతమ్ పాల్గొన్నారు.

నేడు ఆదర్శ శరణ్ దంపతుల అవార్డు ప్రదానం


నాగ్‌నాథ్ మాశెట్టి, జగదేవీ దంపతులు

చార్మినార్: పాతబస్తీ కోకర్‌వాడికి చెందిన టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి, జగదేవీ దంపతులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొంటుండడంతో కర్ణాటకకు చెందిన శరణ్ విశ్వ రచన ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకటించిన ఉత్తమ ఆదర్శ శరణ్ దంపతుల అవార్డు–2023ను సోమవారం మైసూర్‌లో అందుకోనున్నారు. ఆదివారం దంపతులిద్దరు పాతబస్తీ నుంచి మైసూరుకు బయలు దేరి వెళ్లారు. నాగ్‌నాథ్ మాశెట్టి మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉంటూ.. అన్ని వర్గాల పేద ప్రజలకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు.

'భగవద్గీత జీవిత సారాంశాన్ని బోధిస్తోంది'


భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: భగవద్గీత జీవిత సారాంశాన్ని బోధిస్తోందని బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం భగవద్గీత గ్రంథాలను రాంకోఠిలోని శ్రీ శక్తి గణపతి ఆలయం వద్ద భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పవిత్ర భగవద్గీత గ్రంథాలు ప్రతి ఒక్క పౌరుని వద్ద ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లోకంలో భగవద్గీత సారాంశం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మనిషి దైనందిన జీవితంలో భగవద్గీత పఠనం నిత్యకృత్యం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినయ్ తివారి, శ్రీనివాస్‌గుప్తా, నందకిశోర్ అగర్వాల్, సునిల్ అగర్వాల్, మనోజ్, అభినయ్, నరేష్, రామేశ్వర్, రాఘవ పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా తాను తన కార్యాలయంలో ఉదయం సమయంలో గంట సేపు ప్రజలను కలుసుకుంటున్నానన్నారు. ఈనెల 28 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంటుందని అర్హులైన వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం సూచించిన అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్న అర్హులకు రేషన్ కార్డులు అందించే విధంగా తాను కృషి చేస్తానన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి


బహుమతులు అందజేస్తున్న మహిళా నాయకురాళ్లు

అఫ్జల్‌గంజ్: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం ప్రధాని మోదీ పిలుపు మేరకు వీర్ బాల్ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధ్యర్యంలో బేగంబజార్, గోషామహల్, అఫ్జల్‌గంజ్ తదితర పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళా హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్

అబిడ్స్: మహిళా హత్య కేసులో గుడిమల్కాపూర్ పోలీసులు ఓ నిందితుడిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం ..అల్లూరి సీతారామరాజునగర్‌కు చెందిన భారతమ్మ(40) ఈమె గుడిమల్కాపూర్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలిగా కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తుంది. భారతమ్మ తప్పిపోయినట్లు కొన్ని రోజుల క్రితం గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 17న ఆటోడ్రైవర్ అయిన గణేష్ (38)తో ఆయన ఆటోలో భారతమ్మ రాజేంద్రనగర్‌కు వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందింది. అనంతరం అక్కడ ఇద్దరు మద్యం సేవించారు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగారు. కోపోద్రిక్తుడైన గణేష్ ఆమెపై బలత్కారం చేయడంతో పాటు గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. గణేష్ ఆమెకు సమీప బంధువు కూడా అని పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసును గుడిమల్కాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో 60 స్థానాల్లో పోటీ


మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 60 స్థానాల్లో ఏకం సనాతన్ భారత్‌దళ్ పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజీవ్ షా, నరేంద్రకుమార్ చతుర్వేది స్పష్టం చేశారు. ఆదివారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సనాతన హిందూ దేశమైన భారతదేశంలో హిందువులకు గతంలో కాంగ్రెస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలలో న్యాయం జరుగలేదని, బీజేపీ కేవలం హిందువులమని ప్రగల్భాలు పలుకుతూ.. మైనార్టీలకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో గోవధను పూర్తిగా నిషేధించాలని కోరారు. గంగామాత, శ్రీరామసేతులను జాతీయ వారసత్వంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వినయ్‌కుమార్, ఠాగూర్ భరత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



చాంద్రాయణగుట్ట: కల్లు కాంపౌండ్‌లో ఓ గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌ను ఆనుకొని ఉన్న కల్లు కాంపౌండ్‌లో ఉదయం కల్లు తాగేందుకు వచ్చిన ఓ యువకుడు కుర్చీలో కూర్చొని స్పృహ కోల్పోయాడు. నిర్వాహకులు అతడిని గమనించగా మృతి చెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని యువకుడు ఎవరు.. ఎలా చనిపోయాడు.. అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న మిత్రకృష్ణ తదితరులు

జియాగూడ: ఏసుక్రీస్తు శాంతిమార్గాన్ని ఎన్నుకున్నాడని మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఆదివారం తుల్జాభవానీనగర్‌లోని మోహిని ఫంక్షన్ హాల్ వద్ద క్రీస్తు జ్యోతిరి రక్షణ మందిరంలో వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ కేక్ కట్ చేయడంతో పాటు కానుకలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు తూంకుంట అరుణ్‌కుమార్, సాయి, జ్యోతిరాజ్, పద్మ, మంజుల, జ్యోతి, రషీద్, చిరురాజ్, ఆకాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జియాగూడలో క్రిస్మస్ వేడుకలు..

జియాగూడలోని క్రైయిస్ట్ నిసి చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కట్‌చేయడం, బహుమతుల పంపిణీ, క్రీస్తు సందేశం ఇవ్వడం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం


ముస్తాబైన సెయింట్ జోసెఫ్ కెథడ్రాల్ చర్చి

గన్‌ఫౌండ్రీ: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని పలు ప్రార్థన మందిరాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్, విద్యుదీపాల అలంకరణతో పండుగ వాతావరణం రూపుదిద్దుకుంది. ప్రధానంగా అబిడ్స్, గన్‌ఫౌండ్రీ ప్రాంతాల్లో పురాతనమైన చర్చీలతో పాటు చిన్న చిన్న ప్రార్థన మందిరాలు ఈ ప్రాంతాల్లో అధికంగా ఉండడంతో ఈ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని నింపుకుంది. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని అబిడ్స్, బేగంబజార్ మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. గన్‌ఫౌండ్రీలోని సెయింట్ జోసెఫ్ కెథడ్రాల్ చర్చిలో ఏసుక్రీస్తు ఇతివృత్తాన్ని తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. మెథడిస్ట్ చర్చి, సెయింట్ జార్జ్ చర్చ్, సెయింట్ జోసెఫ్ కెథడ్రాల్ చర్చ్ వంటి ప్రార్థన మందిరాలలో పెద్ద ఎత్తున భక్తులతో పాటు పలువురు ప్రముఖులు, విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయా ప్రార్థన మందిరాల నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధిలో టీడీఎఫ్ కీలక పాత్ర పోషించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇకపై రాష్ట్ర అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కోరారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం 7వ ప్రవాసి తెలంగాణ దీవాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ..గత ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీ గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టిందని విమర్శించారు. కొత్త ప్రభుత్వం ఎన్ఆర్ పాలసీపై ముందడుగు వేయాలని సూచించారు. మాజీ ఎంపీ కొండ విశేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిలు మాట్లాడుతూ..... టీడీఎఫ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలంగాణ యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు దివేష్ అనిరెడ్డి, ఊర్వ అధ్యక్షురాలు చల్లా కవిత, సభ్యులు రణధీర్, వట్టే రాజారెడ్డి పాల్గొన్నారు.